


# తలవాకిలి

- షర్మిల

జయమ్మ ఆ రోజు కోడి కూసింది మొదలు అటూఇటూ కాలుగాలిన పిల్లిలా తిరుగుతూనే వుంది. రోజూ తెల్లారేపాటికి ఇంటిచుట్టూ ఊడ్చి కళ్ళాపి జల్లి ముగ్గులుపెట్టి ఆ తరవాత చల్ల కవ్వం దగ్గరికి చేరుతుంది. మజ్జిగ చిలికి వెన్న తీసి మిగిలిన పనులు చూసుకుంటుంది. అట్లాంటిది ఈ పూట కోడల్ని పిల్చి సామ్రాజ్యం! నువ్వే ఊడ్చి ముగ్గులేసుకోమని చెప్పి ముఖం కడుక్కుని బొట్టెట్టుకుని గోయిందాన్ని కేకేసింది. ఒరే! ఈయాల తొందరగా పాలు తియ్యాలి, కుడితి పెట్టు అంది. సామ్రాజ్యానికి పొద్దుటి నుంచి అత్త ఎందుకు హడావిడి చేస్తోందో తెలుసుకానీ తెలవనట్టు ఊరుకుంది. గోయిందం పాలు తీసుకుని రాగానే పెద్ద తెపాళా పాలు వేరేగా తీసింది. ఇయ్యిగో! ఎల్లి బాగ్గెమ్మకి ఇచ్చిరా అంటా వుండగానే ఏ మూల నుంచి వచ్చాడో భూషయ్య ముటముటలాడతా వచ్చాడు.

“ఏంటీ! బాగ్గెమ్మ ఇంట్లో పెళ్లికి పాలు పంపుతున్నావా? నీకు సిగ్గుందంటే? ఆ బాగ్గెమ్మ కొడుకు నీ మరిది కొడుకు బుర్ర పగలగొట్టాడు. అయ్యన్నీ మర్చిపోయి తగుదునమ్మా అని పాలు పంపుందంట! పాలు! అంతేలే అది నీ మరిది కొడుకు బుర్రేగా. అదే నీ తమ్ముడి కొడుకు బుర్రయ్యితే ఈ పాటికి ఆళ్ల ఇల్లుపీకి పందిరేసి వచ్చేదానివి” అంటూ గింజుకున్నాడు. ఈ మాటలన్నీ అనేసినాక జయమ్మ అంది “ నా కొడుకు బుర్ర పగలకొట్టినా నేను పాలు పంపేదాన్నే బాగ్గెం నా చెల్లెల్లాంటిది. మొన్న సందకాడ గోడవతల నుంచుని ‘అక్కా! నువ్వయినా ఈ గోలలన్నీ మర్చిపోయి ఇంటిపెళ్లికి రాకపోతే నా కాళ్లూచేతులూ ఆడతయ్యా, మంచికైనా చెడుకైనా ఇద్దరం కలిసే ఏ పనులైనా చేసుకునే వాళ్లం’ అని దాని సొంత అక్కనయినా పిల్చిందో లేదో? అంత మమకారంగా పిల్చింది.”

“ఇదిగో చెప్తున్నా అది గోడవతల నుంచి పిల్చింది కదా అని నువ్వు ఎల్లావంటే నా కంటే చెడ్డాడు ఇంకోడు వుండడు. ఏంట్రా గోయిందం అట్లా దెయ్యం పట్టినట్టు చూస్తా? పాలు లోపలికి పట్టుకుపో!” అంటూ భూషయ్య కేకలేశాడు.

జయమ్మ ఏం జరగకూడదనుకుందో అంతా జరిగింది. నీరసంగా మజ్జిగ కవ్వం దగ్గరకు చేరి మజ్జిగ చిలుకుతా వుంటే పాత సంగతులన్నీ గుర్తొచ్చినయ్యి. బాగ్గెమ్మ, జయమ్మ ఈ ఊరి తోడికోడళ్లు. జయమ్మ బాగ్గెమ్మ కంటే ఓ అయిదేళ్ల ముందే కాపరానికి వచ్చింది. జయమ్మ ఇంటికీ బాగ్గెమ్మ ఇంటికీ ఒక ఇల్లే అడ్డం. అవాళ పెళ్లయి కొత్తగా కాపరానికి వచ్చిన బాగ్గెమ్మ చుట్టూ అందరూ పోగయ్యారు. “ఏమ్మా మీ అమ్మ కాసుల పేరు పెట్టలా? కాబోయే కోడలి కోసం దాచిందీ?” అని ఒకావిడ, “మీ మేనత్తకి పిల్లల్లేరు కదూ? ఆ ఆస్తి ఎవరికి పెడతందో?” అంటూ ఇంకో ఆవిడ ఆరాలు లాగుతుంటే, జయమ్మ వెళ్లింది. బాగ్గెమ్మ కుదురుగా కూర్చుని వుంది. “చక్కగా పొందికగా వున్నావు. చూడూ! నేను నీకు తోడి కోడల్నేలే! నా పేరు జయమ్మ. అత్తలేని కావరం నీది.

నీకే ఇబ్బంది వచ్చినా ఆ గోడ దగ్గిరికి వచ్చి జయమ్మక్కా! అని పిల్చావంటే చాలు, నేనే వచ్చి ఏంటి చెల్లెలా! అంటా"

ఈ మాటలు విన్న బాగ్గెమ్మ ఇందాకట్నుంచి వెతుక్కుంటున్నదేదో దొరికినట్టు ఊపిరి హాయిగా వదిలింది. ఆ తరవాత 25 ఏళ్ళు ఎట్టా గడిచాయో తెలియదు. అంతబాగా కలిసిపోయారు.

అక్కాచెల్లెళ్లంటే బాగ్గెమ్మ, జయమ్మే అనేవారు ఊరు ఊరంతా.

అట్లాంటిది ఈ మాయదారి ఎలక్షన్లు వచ్చి పడి లేని గోలల తెచ్చిపెట్టినయ్యి. బూడిద కింద దాక్కున్న నిప్పురవ్వ లెగసి ఊరిని భగ్గున మంటలు రేపినట్టు కక్షలు, కార్పణ్యాలు వాటంతట అవే అంటుకున్నాయి. బాగ్గెమ్మ మొగుడు వెంకట్రావు కొత్తగా డబ్బు సంపాయించిన ఊపుమీద వుండాడు. ఊళ్లో పెద్దగా పొలం పుట్రా లేకపోయినా పెళ్లానికి ఇచ్చిన రెండెకరాలు అమ్మి తన రెండెకరాల పొలం పక్కనే రెండెకరాలు కొన్నాడు. ఇంకో పదెకరాల మెట్ట కౌలుకి తీసుకున్నాడు. రాత్రనకా పగలనకా కష్టపడ్డాడు. వరసగా రెండుసార్లు పత్తి మాంచి ధర పలికింది. అంతే ఆ డబ్బుకి, జయమ్మ నగానట్రా అమ్మి జత చేసి పక్కూళ్లో ఎరువుల కొట్టు పెట్టాడు. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూడలా! డబ్బు ఈ ఏటి కాయేడు పెరుగుతూనే వుంది. నాలుగు డబ్బులు, నలుగురు మనుషులు చుట్టూ చేరగానే సహజంగానే దృష్టి రాజకీయాల మీదికి మళ్లింది. ఏనాటి నుంచో భూషయ్య ఊర్లో పెద్దమనిషి కింద చెలామణీ అవుతున్నాడు. ఈ సారి పంచాయితీ ప్రెసిడెంట్ స్థానం ఎస్.సి. రిజర్వుడు వచ్చింది. అప్పటి వరకూ చల్లగా వున్న ఊరు వేడెక్కింది.

ఆవాళ ఊరి పెద్దలంతా అరుగుల మీదకి చేరారు. భూషయ్య అన్నాడు మన ఈరయ్యను నుంచోబెడదాం,

**ఆవాళ ఊరి పెద్దలంతా అరుగుల మీదకి చేరారు. అప్పుడు ఏం జరిగిందంటే...**

మనమాట ఇంటాడు అని. "ఊహూ! వద్దే అన్నయ్యా! నీ మాట ఇంటాడేమో గానీ నా మాట ఇనడు. పరమ తిక్క! మన బిచ్చాలు కొడుకు ఈశ్వరయ్య కాస్తో కూస్తో చదివాడు. లౌక్యం కలవాడు. అట్టాంటాడయితే ఇటు మనకీ లాభం!" అన్నాడు వెంకట్రావు. ఆమాట మీద ఇద్దరికి బేధాలొచ్చినయ్యి. మనసుల్లో పెట్టుకున్నారు.

భూషయ్య తమ్ముడి కొడుకు ఆవాళ పొలానికి గేదెలు మల్లెయ్యడానికి ఎల్లాడు. ఎట్టా ఎల్లిందో ఒక గేద వెంకట్రావు చేలో పడి మెయ్యడం మొదలెట్టింది. వెంకట్రావు మనుషులు గేదను పట్టుకుని ఆళ్ల చావిట్లో కట్టేశారు. "ఏరా! అంత ఒళ్లు బలిసి కొట్టుకుంటున్నారా" వెంకట్రావు మనుషులు నోరు జారారు.

"మాకేంరా? మీకు మల్లే తిండికి మొకం వాచినాళ్లం కాదు. మా తాతల్నాటి నుంచి ఒకరికి చెయ్యి జాపినాళ్లం కాదు. నడమంత్రపు సిరి ఇప్పుడు రాలా!" అని భూషయ్య మనుషులు అనేసరికి, ఇద్దరికీ పంతాలు పెరిగి కర్రలు లేచాయి. చివరికి భూషయ్య తమ్ముడి కొడుకు బుర్ర పగిలింది. అదిగో! అవాళ నుంచి ఇవ్వాళ వరకూ ఆ ఇంటి కాకి ఈ ఇంటి మీద వాలలేదు. కాకులు వాలకపోయినా సందకాడ పనులైన తరవాత గోడ మీద నుంచి బాగ్గెమ్మ, జయమ్మ మంచీ చెడ్డా మాట్టాడుకుంటానే వుండారు.

'అత్తయ్యా!' అన్న కోడలి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చిపడింది జయమ్మ. మజ్జిగలోంచి వెన్న గిన్నెలోకి తీసింది.

అక్కడ బాగ్గెమ్మకి నిజంగానే కాళ్లూ చేతులూ ఆడడంలా. కొడుకు పెళ్లి పెట్టుకున్నప్పటి నుంచి బయపడతానే వుంది ఈ గొడవల మూలాన జయమ్మ వస్తందో రాదో అని. ఊరంతా భోజనాలు పిల్చుకుంది. ఇట్టాంటివి ఏవి వచ్చినా జయమ్మ తలలో నాలికలాగా అన్ని చూసుకునేది. అసలు ఊళ్లో ఏ పెళ్లి జరిగినా, పేరంటం జరిగినా జయమ్మ హయాంలో జరగాల్సిందే. జయమ్మ వంటల దగ్గరుందంటే ఆ ఇంటివాళ్లెవరూ ఆ వైపు చూడక్కర్లా. ఎన్ని బియ్యం వండాలి? ఎన్ని వీశెల మిఠాయి కావాలో టకటకా చెప్పెయ్యగలదు. పెళ్లి దగ్గర ఏమేమీ కావాలో లిస్టు చెప్పడం దగ్గర్నుంచి తలంబ్రాల బియ్యం కలిపే వరకూ అన్నింట్లోనూ జయమ్మ తానే అయి తిరుగుతుంది. అట్టాంటిది తన ఇంట్లో పెళ్లికి జయమ్మ రాకపోతే చెయ్యి ఇరగ్గొట్టుకున్నంత బాధగా వుంది బాగ్గెమ్మకి. "ఏవమ్మా! పూర్ణాలకి ఎంత శెనగపప్పు పొయ్యమంటా? అంటా వచ్చిన వాళ్లకి ఏం చెప్పాలో తోచక అక్కడ కూర్చున్న మాలక్ష్మిని అడిగింది. "ఆ! ఎంత వదినా ఒక పది కేజీలు ఉడకబెట్టించు" అంది. "అయ్యో సాలతయ్యి ఎంత లేదన్నా 15కేజీలే వుండాల్సిందే!" అంటూ రాజ్యం అందుకుంది.


" అసలు ఎంతెయ్యమంటారో చెప్పండి? అవతల వంటాళ్లు గోల చేస్తన్నారు" అని వచ్చినావిడ అరుస్తాంది. బాగ్గెమ్మ అసహనంగా అటూ ఇటూ చూస్తుండగా...కిర్రుమంటూ దొడ్డి గుమ్మం తెరుచుకుంది. జయమ్మ లోపలికి అడుగుబెట్టింది. తిన్నగా వంటల దగ్గరికి వెళ్లింది. "ఏంటండీ ఎసరు మరగకుండా బియ్యం పోస్తారు? నానిపోవూ! ఇదిగో కోడలు పిల్లా! ఆ కొబ్బరి కోరకుండా కబుర్లేంటి?" అంటూ పనులు చక్కబెట్టడం ప్రారంభించింది. బాగ్గెం తన కళ్లను తనే నమ్మలా! మనసు ఒప్పక తను పిలిచిందే కానీ జయమ్మ రాదనే అనుకుంది. బాగ్గెమ్మ జయమ్మ దగ్గరగా ఎల్లింది.

"వచ్చావా! అక్కాయి" రెండు చేతులూ పట్టుకుంది.

**"ఎట్లా రాకుండా వుంటానే! అందులో నూ నీ ఇంట్లో శుభ కార్యానికి నేను లేకుండా ఎట్టా? ఇదిగో ఈ దొడ్డి గుమ్మం నుంచి వచ్చేశా!" అనగానే బాగ్గెం "మనకి దొడ్డి గుమ్మమేం కర్మ! మన మగాళ్లకి బుర్రలు పగలకొట్టుకుంటే కొట్టుకోమను. మన ఆడంగులం మాత్రం కొంగు బిగించి తలవాకిలి నుంచే తిరుగుదాం. ఎవరేం చేస్తారో చూద్దాం" అంది కళ్లు తుడుచుకుంటూ.**

## 'నూరుల్లా' అయస్కాంత విద్యుత్

గాలి మరలతో విద్యుత్ ఉత్పాదన, సౌరశక్తితో విద్యుత్, జల విద్యుత్‌లను సృష్టించినట్టే భూమ్యాకర్షణ శక్తితో విద్యుత్ సృష్టించ వచ్చుంటున్నాడు సరైన ప్రోత్సాహం అందని పేద శాస్త్రవేత్త నూరుల్లా. పేదదేశానికి ఒక శక్తివంతమైన యంత్రాన్ని రూపొందించానంటున్న ఆకుమళ్ల నూరుల్లా ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లికి చెందిన కలిగిరి వాస్తవ్యుడు. రైతు కుటుంబంలో పుట్టిన ఇతను 35 ఏళ్లపాటు ఎలక్ట్రీషియన్‌గా, మెకానిక్‌గా పనిచేశాడు. ఆ అనుభవంతో ఇతడు రూపొందించిన విద్యుత్ ఉత్పత్తి యంత్రం సంప్రదాయేతర ఇంధనవనరుల అభివృద్ధి సంస్థ ఎం.డి ఫణీందర్‌రెడ్డి, ఎ.పి. స్టేట్ కౌన్సిల్ ఫర్ సైన్స్ సభ్యుల ప్రశంసలు పొందింది.



ఈ యంత్రం ఇనుపప్లేట్లు, ఇనుపరాడ్‌లు, బుష్‌లు, మోటారు సిస్టమ్స్‌తో 300 కిలోల బరువుంటుంది. నూరుల్లా దీన్ని గరిమనాభి ఆధారంగా రూపొందించాడు. దీని ద్వారా ఒక కుటుంబానికి సరిపడా ట్యూబ్‌లైట్లు, రిఫ్రిజరేటర్, టి.వి., ఫ్రిజ్, మిక్సీ, ఎయిర్‌కూలర్, వాషింగ్ మెషిన్ వంటివి పని చేయగల విద్యుత్‌ను సమకూర్చుకోవచ్చు. పదివేల రూపాయల ఖర్చుతో 4.7 కిలోవాల్టుల విద్యుత్ ఉత్పాదన ఈ యంత్రం ద్వారా సాధ్యం. బావుల్లోని నీటిని తోడేందుకు చక్రాలు వినియోగించవచ్చనే ఆలోచనే విద్యుత్ నిర్మాణానికి పునాది వేసిందంటారు ఈ గ్రామీణ శాస్త్రవేత్త. ఆ యంత్రం కాలుష్య కారకం కాదు. అయితే, ప్రజలు పిచ్చి వాడంటున్నా పట్టించుకోకుండా నిరంతర పరిశోధనల్లో గడిపే నూరుల్లా తయారు చేసుకున్న సుమారు లక్షరూపాయల విలువ చేసే యంత్రాలు వరదల భీభత్సం రుచి చూసాయి. నీటి ప్రవాహంలో వడికొట్టుకు పోయాయి. మళ్ళీ తనదైన విద్యుత్‌ప్లాంట్‌ను నిర్మించుకోవడానికి ప్రభుత్వంగానీ, పారిశ్రామిక సంస్థలుగానీ, ప్రజలు గానీ ముందుకు వచ్చి ఆదుకోవాలని నూరుల్లా కోరుకుంటున్నాడు.

జలాశయాల్లో నీరులేక విద్యుత్‌కోతకు అల్లాడే వినియోగదారులకు తాను రూపొందించిన భూమ్యాకర్షణ యంత్రం ఎంతో ఊరటనిస్తుందని ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తున్న నూరుల్లా శాస్త్రవేత్తగా నిలిచి గెలిచేనా?!

**- తన్నీరు శ్రీనివాసులు**